

# సెక్యూరిటీ ఖరీదు

మాదిరెడ్డి సులోచన

"ఆటో వచ్చిందమ్మా!" మా పని వాడి కేక. బొట్టు దిద్దుకుని బయటికి వచ్చాను. వికారాబాద్‌లో మా మామయ్య కొడుకు పెళ్ళి. వాడు తమ్ముని కంటే యెక్కువగా మెలిగినవాడు. పెళ్ళికి వెళ్ళి తీరాలి. వికారాబాద్ వెళ్ళే రైలు బండ్లు సమయానికి బయలుదేరితే ఆ రోజు వింత పని ఏదయినా జరుగుతుందని వాడుక. వెళ్ళి ఆటోలో కూర్చున్నాను.

"మీరు భోజనానికి వస్తారా?" మా పనివాడి కేక.

"సాయంత్రం వస్తాను. ఉన్నవాళ్ళకే వండెయి. పోనియ్యవయ్యా!"

"అమ్మా! ఆగుండి ..." ఆపాడు. మా చాకలి వాడు వచ్చాడు.

"ఏమిట్రా:" విసుగ్గా అడిగాను.

"మా అక్కను అత్తగారేదో అన్నారంట మా అమ్మ వెళ్ళాలంట. అయిదు రూపాయలు అడుక్కు రమ్మంది."

మారు మాటాడక రూపాయలు ఇచ్చాను.

"పోనియ్యవయ్యా....."

"క్రాంతీ!"

"ఓ...ఏమిటండీ?" నైట్ డ్రస్‌తో వచ్చే శ్రీవారిని అడిగాను.

"నా షర్టు బయట పెట్టావా?"

"తీసుకోండి..." మండి పోతుంది.

"మహా బండి పెముకు బయలు దేరినట్టు ఏమిటా తొందర..." అంటున్నా వినిపించుకోకుండా ఆటోను పోనిమ్మన్నాను. పది నిమిషాలే ఉంది సమయము రైలు వేగముయెంత ఉంటుందో గని నా హార్టు బీటింగ్ మాత్రం హెచ్చింది. నాంపల్లి స్టేషన్ ఫర్లాంగ్ దూరం ఉందనగా 'బర్ర్' 'బర్ర్' మంటూ ఆటో ఆగిపోయింది.

"ఏమిటయ్యా!"

"ఏం లేదు" అని హాండిల్‌తో కుస్తీ పట్ట సాగేడు, ఆటో డ్రైవరు. ఇక లాభం లేదని మీటరు చూచి డబ్బులిచ్చేశాను. నడక ప్రారంభించాను. నిజంగా పెళ్ళిళ్ళలో పట్టు చీరలు కట్టుకోవాలని రూల్ యెవరు పెట్టారోగానివాళ్ళకుపాపం చుట్టుకోవాలి న్యాయానికి. ఉక్క, దానికి తోడు ఏడున్నరకే సూర్యుడు తన ప్రతాపం చూపాడు. స్టేషన్ చేరేసరికి నీరుగారి పోయాను అద్దంలో చూచుకోలేదుగాని పగటి వేషములా తయారయి ఉంటుంది నా అలంకరణ.

"కొంపదీసి నేల ఈనిందా?" అనుకున్నాను మనసులో. స్టేషనులో జనం విపరీతంగా ఉన్నారు, బండి వెళ్ళిపోయే ఉంటుంది. "పోర్టర్ సినిమా షూటింగ్ అవుతుందా?" అన్నాను. నాకు బాగా తెలుసు. సినిమా షూటింగ్ అనగానే యెగ బ్రాకుతారు జనము.

"షూటింగ్ .... లేదు .... బొంబాయి బండి ఢిల్లీ బండి ఒకేసారి వచ్చినయి తల్లీ ...." అతను యెవరి కోసమో చూస్తున్నాడు

"రైల్ వెళ్ళిపోయిందా? నేను వికారాబాద్ వెళ్ళాలి."

"లేట్ అయింది. జల్దీ జల్దీ వెళ్లు"

వాడు మాటలో చూపిన జల్దీ నడకలో చూపి చటోయి ఇద్దరి ముగ్గురిని ఢీకొన్నాను. అయిదు నిమిషాలకు బుకింగ్ కవుంటర్ చేరుకున్నాము. ఊపిరి ఆడనట్టుంది. క్యూ కొండవీటి చాంతాడులా వుంది.

"అవున్లే మాలాంటి వారి పెళ్ళికి యెందుకొస్తారు!"

"తమ్ముడు అంటూ ఉత్తుత్తి ప్రేమేలే.." అందరూ నిష్ఠూరం ఆడుతున్నట్టు అనిపించింది. ఆ క్యూలో మా బంధువుల అబ్బాయి కనిపించాడు

"యురేకా!' అని ఆర్కిమెడిస్‌లా అరవాలనిపించింది. అతన్ని చూచిన నా ఆనందం ఏం చెప్పను? యెవరెస్ట్

యెక్కినప్పుడు టెన్‌సింగ్ కూడా పొంది ఉండడు. అంత ఆనందం.

"బాబూ.... నా కు ఒక టికెట్ తీసుకురా."

"మంచి దక్కా! అమ్మా వాళ్ళంతా బండిలో ఉన్నారు. మీరు వెళ్ళండి" అన్నాడు. జనాన్ని తప్పించుకుని, తలపై పెట్టె బెడింగ్‌తో వచ్చే కూలీలతో మొట్టికాయలు తింటూ, మరో లీటరు చమట ఒడిపించి ప్లాట్‌ఫార్మ్ చేరుకున్నాను బండి ప్లాట్‌ఫార్మ్‌మీద సిద్ధంగా ఉంది. మొదట డబ్బా దగ్గర ఆగాను. ఓ ముస్లిం కుటుంబము తమ తోషా (టిఫిన్)విప్పి అప్పుడే భోజనంమొదలు పెటారు. యెక్కబోయాను. వాళ్ళంతా కోరస్‌గా దిగి పొమ్మన్నారు.

"ఉతరో...(దిగు) ఉతరో..."

"రిజర్వేషనా!"

"చెప్తే మీకి కాదు మాకి చుట్టములు వస్తయి."

బలవంతంగా నేను యెక్కినా దింపే సేలా ఉన్నారు. ప్రక్క కంపార్టుమెంటు దగ్గరకు వెళ్ళాను. అక్కడా అంతే! ఒక ముస్లిమ్ స్త్రీ ఆప్యాయంగా భర్తకు చిన్న ప్లేటుతో అన్నం పెడుతుంది. నాకు అనుమానము వచ్చింది. మేల్‌లో భోజనాల గొడవ వుండదు. ఉన్నా, ఏ పన్నెండింటికో. సూర్యోదయంతోనే భోజనాల వైభవము ఒక్క బీదర్ బండిలోనే చూస్తాము. అంతే ఉదయము వెళ్ళాల్సిన బీదర్‌బండి వెళ్ళలేదన్న మాట. మరో కంపార్టుమెంటులో యెక్కబోయాను. క్యూలో నిల్చున్న మా బంధువుల అబ్బాయి వగరుస్తూ వచ్చాడు. అప్పుడే గార్డు పచ్చజండ పట్టుకున్నాడు

"తెచ్చావా, బాబూ!" డబ్బులు ఇవ్వబోయాను.

"లేదండీ బెల్ వినిపించి పరుగెత్తు కొచ్చాను."

"మరెలా?"

"మీ కెందుకు మీరు యెక్కండి, బేగంపేట్లో అలా బండి ఆగగానే ఇలా దూకి టికెట్లు తెస్తాను" అన్నాడు.

"ఇది మోసం కాదా?"

"మనము కావాలని చేస్తున్నామా? పరిస్థితి అలా వచ్చింది యెక్కండి." అతను యెక్కాడు. నేను యెక్కాను. కాని సీటుపై నిశ్చింతగా కూర్చోలేక పోయాను. టి సి. వచ్చి అడిగితే యెంత అవమానము. అదికాక టికెట్ లేక ప్రయాణం చేయటమా! పరిస్థితి టి. సి. కి వివరిస్తే? ఆ పనే చేయాలి. వెంటనే దిగాను. అదృష్టం టి.సి గార్డు ఏవో మాట్లాడుతూ ఒకే చోట ఉన్నారు.

"క్షమించండి—" దగ్గరగా వెళ్లాను. పరిస్థితి అంతా వివరించాను. "ఇప్పుడు టికెట్ కొనే సమయము లేదండీ."

"తరువాత బండిలో వెళ్లండి."

"పెళ్ళికి వెళ్ల లేనండీ." అన్నాను.

"వెళ్ళి కూర్చోండి. నేను బేగం పేట్లో వచ్చి మాట్లాడుతాను." అన్నాడు 'అమ్మయ్య' అనుకున్నాను. కొంతంత బరువు దిగింది. సంతోషంగా ఉంది. గాంధీగారు అన్నారు, సమాజాన్ని బాగు చెయ్యాలనే తాపత్రయము కంటే నిన్ను బాగు చేసుకుంటే సమాజం బాగు పడి నట్లే అని. నిజంగా చిన్న, చిన్న విష యాలలో జనానికి కక్కుర్తిదేనికో ! చెప్పి బండి యెక్కితే యెంత తేలిక ! టికెట్ లేక యెక్కి ప్రతిమ లుతారు. ఇదే ఊపులో న్యాయాన్ని గూర్చి. నిజాయితీని గూర్చి ఓ చిన్న ఉపన్యాసం దంచినట్టు గుర్తు. బండి పెళ్ళికూతుర్లా బేగంపేట చేరుకుంది. మా బంధువుల అబ్బాయి బండి ఆగి, ఆగటం తోనే ఒక్క దూకు, దూకాడు. మరో అయిదు నిమిషాలకు టికెట్లు తీసుకుని వచ్చాడు. అవి తనవారి కిచ్చి నిశ్చింతగా నిల బడ్డాడు. బండి కదులబోయే ముందు టి. సి. వచ్చాడు. అతని వెనుక పోలీసు కూడా ఉన్నాడు. నిజంగా మన ప్రభుత్వం నిజాయితీని మరొకసారి మెచ్చుకున్నాను మనసులో.

"మేడమ్ డబ్బు తియ్యండి."

రెండురూపాయల నోటు తీశాను, చిల్లరకోసం చూచాను."

"ఏడు రూపాయల చిల్లర తియ్యండి."

"అదేమిటండీ, అంతగా రేట్లు పెరిగిపోయాయా ?"

"రేటు ఏమిటి ? రెండు రూపాయల చిల్లర టికెట్టు, అయిదు రూపాయలు ఫైన్ !"

"ఫైనా ?" తెల్లబోయాను.

"త్వరగా తియ్యండి మేడమ్ ఒక్కొక్కరి దగ్గర ఇంతసేపుంటే ఎలా ?"

"ఫైన్ ఎందుకో నాకు అర్థం కావటం లేదు. మీకు పరిస్థితి అంతా చెప్పాను కదా" అన్నాను రోషంగా.


"సిన్సియారిటీ ఖరీదు అంటే బావుం టుంది ఫైన్ అనే బదులు." అప్పటి వరకు ఎదుటి సీట్లో కూర్చున్న యువ కుడు కిసుక్కున నవ్వాడు. టి. సి. కొర కొర చూచాడు.

"చెప్పి ఎక్కారనే అయిదు రూపా యలు. లేకపోతే పదండి."

పోలీసు అతను నాకు చెబుతున్నాడు.

"నేను మా టికెట్లతో తెచ్చేవాడిని కదక్కా ! నన్ను పూర్తిగా మోసగాడి క్రింద జమ కట్టావు." అన్నట్టున్నాయి మా బంధువుల అబ్బాయి చూపులు.

"మాకు నోట్లో నాలిక లేదను కున్నావా తల్లీ ! ఇలా జరుగుతుందని ముందే తెలుసు." అన్నట్టున్నాయి అప్పుడే టికెట్టు తెచ్చుకున్న మరొకతని చూపులు. డబ్బు పోయిందని బాధకాదు. నిజాయితీగల దాన్నని బొరియు విరు చుకోబోయి పెద్ద ఫూల్ను అయ్యానే అని బాధపడ్డాను.




"ప్లీజ్!" అన్నాడు టి. సి. మరో పారి.

లాభంలేదని పర్స్‌తీసి పది రూపాయలు ఇచ్చాను.

"రసీదు యివ్వండి." అన్నాను. పరువు తీశారు. నా సిన్సియారిటీని కొరగానిదన్న వీరు నా డబ్బు తీసుకోవటానికి వీలులేదు.

"ఇస్తానమ్మా రాయలా వద్దా?" టి. సి, కొరకొర చూచాడు. ఆ తరువాత నాకు చిల్లర రసీదు ఇచ్చారు. అంతవరకున్న చికాకు మాయం అయింది. నా డబ్బు అన్యాక్రాంతం కాలేదు. ప్రభుత్వానికే పోతుందనుకుంటే చాలా సంతోషంగా వుంది. ప్రభుత్వం ఇంత కచ్చితంగా ఉండటం మంచిదే అనుకున్నాను

అరగంట తరువాత పోలీసు అతను మెల్లగా సీట్లక్రింద గాలించ సాగేడు. చిన్న చిన్న బియ్యం మూటలు బయట పడాయి. అతను మూటను చూచి ఉజ్జాయింపుగా రేటులా చెబుతున్నాడు. టి సి. రాసుకుంటున్నాడు.

"ఈ మూట అ౦.. రెండు రూపాయలు సర్ ...."

"ఊఁ.... వాడెవగో తలక్రింద పెట్టుకున్నాడు చూడు."

టి. సి. పైకిచూసాడు. పోలీసు

ఒక్కగుంజా గుంజాడు.

"యెవరా!" అతను లేచాడు.

"తాతగారి బండి అనుకున్నావా! ఈ బియ్యం ఎందుకు తీసుకు పోతున్నావు?"

అతను ఒళ్లు విరుచుకుని లేచాడు. నిర్లక్ష్యంగా క్రిందికి దిగాడు. "తాతగారి బండి అనేనా అందరూ గ్గేజి తీసుకు పోతారు?"

"స్టాప్! నాన్ సెన్స్, గ్గేజి వేరు బియ్యం వేరు."

"బియ్యం మూడు పూటల బత్తెం కావాలంటే చూచుకో. బీదర్‌లో ఇంట ర్వ్యూ ఉంది. హోటల్లో ఉండే సత్తా లేదు యెక్కడో ఒండుకుందామని..." మరో బస్తా సంచినుండి ఒక స్టౌ, చిన్నగిన్నె తీశాడు.

"టికెట్టేది?" టి. సి. అనుమానంగా చూచాడు.

"టికెట్టు లేకుండా యెక్కే అలవాటు ఇంకా కాలేదు. ఇకముందు అవుతుందో యేమో తెలియదు" అన్నాడు.

"ఊం.... బియ్యంది ఫైన్?"

"కిలోన్నర బియ్యానికి ఫైనా?"

"గింజన్నర బియ్యం అయినా వేస్తాము."

"అయితే మొదట ఈ బస్తాలకంతా ఫైన్ వెయ్యండి." లోపలి సీట్లనుండి గుంజాడు అతను. టి సి. ముఖం మెలమెలం పోయింది. పోలీసు ముఖం ఎఱ్ఱగా మారింది.

"అది నీకు అనవసరము." హూం దాగా చెప్పబోయినా గొంతు కీచుగా వినిపించింది.

"నాకెలా అనవసరము. ప్రభుత్వం చేసే చట్టాలు, జుల్మానాలు అందరకు సమంగా ఉండాలి."

"ఆవి వారి బంధువులయా?" ఎవరో తెలియక అడిగారు. నేను తమాషా చూస్తున్నాను. కిలోన్నర బియ్యానికి గోలపెట్టే టి. సి. క్వింటాల్ కనిపించినా నిర్లక్ష్యంగా నీకు అనవసరం అంటాడేం? నేనే గనక ఆయన స్థలంలో ఉంటే అతన్ని అభినందించే దాన్ని.

"మీకు మా మూట్ల కట్టేవారికి క్వింటాళ్లు అయినా తీసుకు పోనిస్తారు. నేను ఒండుకునే బియ్యానికి ఫైన్ వేస్తారా? ఈ న్యాయం దావుంది: అతను పేలవంగా నవ్వాడు. ఆబియ్యం తాలూకు మనుషులనుకుంటాను. దూరం నిలబడి బిక్కు బిక్కున చూస్తున్నారు. వారు ఆ బియ్యము బ్లాకులో అమ్మాలని తీసుకుపోవటం లేదు. వారికి జీవనో పాధి అది. ఇక్కడ రెండున్నర కిలో కొంటే బీదర్‌లో, అవతల అయిదు రూపాయలకి కిలో అమ్ముకుంటారు. వచ్చిన లాభంలో, టి. సి లకు, పోలీసులకు, దారి ఖర్చులకు పోను, రెండు పూటలకు తిండి దొరుకుతుందో లేదో

అనుమానమే. ఒంటిమీద కండరాలు అనేవి కనిపించటము లేదు. గుడ్డలు కూడా చిరిగిపోయి, మాసిపోయి జిడ్డు ఓడుతున్నాయి.

"మీరు నేను అడిగినట్టు ఫైన్ కట్టాలి అది, ఇది అడగకూడదు." టి.సి. ఆజ్ఞ

"ఎందుకు కూడదో చెబితే సంతోషిస్తాను."

"చెప్పవలసిన అవసరం నాకు లేదు."

"ఏందయ్యా, చదువుకున్నట్టున్నావు! ఆ అమ్మ చూడు చెప్పి యెక్కినా. ఇది రూల్ అంటే తల ఒగ్గి ఫైన్ కట్టలేదూ?"

"ఆమెకు చేతకాక, చేవ చచ్చి ఉందేమో ......" నా వంక నిరసనగా చూచాడు. నాకు కోపం రాలేదు. నిజంగా నేను చేతకాని దాన్నే.

మాటా. మాటా పెరిగింది. పోలీసులు తిట్టే బండబూతులు వినలేక అతను పోలీసును చాచి లెంపకాయ కొట్టాడు. దాంతో గొడవ పెద్దదే అయింది. ఈ లోగా యెక్కేవా రెక్కారు. దిగేవారు దిగారు బండి ఆగినప్పుడు.

"దొంగ సన్యాసులు! మామూళ్లు ముడితే మాట్లాడరు. లేకపోతే ఎక్కడ లేని రూల్సు వస్తాయి." కేజీ న్నర బియ్యపు ఆసామి అంటున్నాడు

"మర్యాదగా మాట్లాడు. వికారాబాద్ రాని ఆస్పాల్టు క్రింద కేసు పెట్టకపోతే చూడు..."

"చూస్తాను.... ఈ మూటల బియ్యం ఫైన్ లేకుండా యెలా క్రిందికి దిగుతాయో"

వికారాబాద్ వచ్చింది. అందరం దిగాము క్షణము పెళ్ళి విషయము మరిచిపోయాను. అక్కడ ఏం జరుగుతుందోనని చూచాము. ఇనస్పెక్టర్ రాగానే టి. సి. గార్డు ఏ మాట్లాడారు. ఇనస్పెక్టర్ ఆ బియ్యం తనవని, ఫైన్ క్రింద రూపాయలు టి. సి కిచ్చాడు. కేజిన్నర బియ్యమతను కొర కొర చూచి తను ఫైన్ కట్టాడు.

"దొంగ సన్యాసులు! ఇంత ర్వ్యూ లేకపోతే ఈ దొంగ నాటకానికి అంతుచూచే వాడినిరా ...." పళ్లు పట పట కొరుకుతూ, కదిలే ట్రైన్ ఎక్కాడు. టి. సి. తనూ వెడుతూ ఇన్స్పెక్టర్ ఇచ్చిన నోట్లు తొత్తిపెట్టి వాపస్ యిచ్చాడు. నా తల తిరిగిపోయింది.

"లోకంలో నీతి నిజాయితీ లేదు."

"సిన్సియారిటీ లేదు."

"విలువలు నాశనమయ్యాయి."

ఇలాంటివి ఏ నోటవిన్నా వింటుంటాము. సిన్సియారిటీ ఖరీదు.... యెంత? నాకు తోచదు. మీరయినా చెప్పండి!

"పదండి...పదండి." మా బంధువులు తొందర పెట్టారు.